# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



## ధరణి తీసేస్తమన్న కాంగ్రెస్‌ను తరిమికొట్టాలె

నాకు తంగళ్లపల్లిలో ఐదెకరాల భూమి ఉన్నది. తెలంగాణ వచ్చినంక ఎవుసం మంచిగ జేసుకుంటున్న. ధరణి పోర్టల్‌తో రైతులకు బాధలు తప్పినయి. మండలాఫీసుల కాడ పైసలియ్యనియనిదే పని అయ్యేదికాకుండె. ఇప్పుడు ఆ బాధలు లేవు. ధరణి వల్ల భూ రికార్డులకు భద్రత, రైతులకు భరోసా కలిగింది. మన భూమి మన అనుమతి లేనిదో ఎవరి పేరుకు మారకుండా చేసిన్రు. భూ రికార్డుల ప్రక్షాళనపెట్టి, అక్కడిక్కడే సమస్యలు పరిష్కరించిన్రు. నాడు పట్వారీ, తహశీల్దార్లు, సార్ల చుట్టూ చెప్పులరిగేలా తిరిగిన పాస్‌బుక్ ఇయ్యలేదు. సబ్ రిజిస్ట్రేషన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని, మ్యూటివేషన్ కోసం మండలాఫీసుకు సుట్టు తిరిగేది. ఇప్పుడు ఆ బాధ లేదు. ధరణితో సక్కగున్నది. ధరణి తీసేస్తమన్న కాంగ్రెస్‌ను తరిమికొట్టాలె.. రైతులకు మంచి చేస్తున్న కేసీఆర్ సారే మళ్ల సీఎం కావాలె.

**- దోర్నాల జయరాంరెడ్డి, తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్)**



## కేసీఆరే మళ్ల సీఎం కావాలె



ధరణితో రైతాంగం సంతోషంగా ఉన్నారు. రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళన, ధరణి పోర్టల్ తీసుకొచ్చిన ఆయన రుణపడి ఉంటరు. ఈ మధ్య నేను కొంత పొలం, ప్లాట్లు కొన్న. ధరణి ద్వారా మీ–సేవలో స్లాట్లు బుక్ చేసుకొన్న. తహసీల్ ఆఫీసులో అర్ధగంటలనే రిజిస్ట్రేషన్ పూర్తయింది. మండల కేంద్రంలోని రిజిస్ట్రేషన్లు చేస్తుండగా, సయయం, నగదు ఆదా అయితన్నయి. ధరణి మంచిగున్నది. సాగును బంగారం చేసిన కేసీఆర్‌కు అందరూ అండగా ఉండాలె. మూడోసారి సీఎంను చేసుకోవాలె.

**- లింగంపెల్లి లక్ష్మణ్, చంద్రంపేట (కలెక్టరేట్)**

## అర్ధగంటలనే నాపొంటి పట్టా అయింది



మాది వ్యవసాయం కుటుంబం. మంగళ్లపల్లి గ్రామంలో ఎవుసం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నం. కొన్నేండ్ల క్రితం మా బంధువుల భూమి కొన్నం. మునుప్పటి లెక్క ఆ భూమిని పట్టా జేసుకొనేందుకు కార్యాలయాల చుట్టూ తిరాగాల్సి వస్తదని అనుకొని భయపడిన. ధరణి ద్వారా స్లాట్ బుక్ చేసుకుంటే అర్ధగంటలనే పని అయిపోతదని మా ఊరోళ్లు కొంతమంది చెప్పిన్రు. అయినా నేను నమ్మలేదు. తహసీల్ ఆఫీసుకు పోయి సార్లను అడిగి తెలుసున్న. వాళ్లు కూడా అట్లనే చెప్పిన్రు. ముందుగాలా మీ సేవకు పోయి స్లాట్ బుక్ చేసుకోమన్నరు. మరోసటి రోజే ఆఫీసులో సార్లు కాగితాలను పరిశీలించి ఎకరం భూమిని నా పేరు మీద ఎక్కించిన్రు. వెంటనే పాస్‌బుక్ ఇచ్చిన్రు. ఇంత తొందరగా నా పేరు మీదు భూమి ఎక్కుతదని అనుకోలె. చాలా సంతోషమైంది. ఎవరికీ లంచం ఇవ్వకుండా పని అయింది. ఈ ధరణి మంచిగున్నది. కాంగ్రెసోళ్లు అధికారంలోకి వస్తే ధరణిని తీసేస్తమంటున్నరు. అప్పుడంత గోస వెట్టి, ఇపుడు ఏదో చేస్తమని కాంగ్రెసోళ్లు వస్తున్నరు. వాళ్లు అచ్చేది లేదు.. సచ్చేది లేదు. వచ్చినా చేసేదేమీ కూడా లేదు.

**-దేశెట్టి మహేశ్, మంగళ్లపల్లి, (కోనరావుపేట)**

# మమ్మల్ని ముంచే కుట్ర

- మళ్లీ పాత పద్ధతితో ఆగం చేస్తరా
- పైరవీకారుల రాజ్యం తెస్తరా..
- ధరణిని రద్దు చేస్తే మళ్లీ గెట్టు పంచాయితీలే
- తాకులాటలు పెట్టే వాళ్లను తరిమి కొడుతం
- ఎట్టి పరిస్థితిలో కాంగ్రెస్‌ను రానివ్వం
- భూములను కాపాడే బీఆర్‌ఎస్‌కే మద్దతిస్తం
- స్పష్టం చేస్తున్న రైతులు

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 24(నమస్తే తెలంగాణ): నాడు భూముల గొడవలు అన్నీ ఇన్నీ కావు.. అధికారులు చేసిన నిర్వాకానికి పాలోళ్ల మధ్య గెట్టు పంచాయితీలు.. అన్నదమ్ముల మధ్య కొట్లాటలు.. ఒకరి పేరు బదులు మరొకరి పేరు తప్పు రాస్తే దాన్ని సరిదిద్దుకోడానికి ఏండ్లకాలంగా అధికారుల చుట్టూ తిరిగేది. ఒక్క తిరుగుడే కాదు.. వాళ్లడిగినన్ని పైసలు ముట్టచెప్పనిదే ఫైలు ముంగటికి పోకపోయేది.. ఈ మధ్యల పైరవీకారులు బతికేది.. చేతిల ఇన్ని పైసలుండి కొంత భూమి కొందామనుకునేటోళ్లకు చుక్కలు చూపించేది. రిజిస్ట్రేషన్ చేసుకోడానికి రిజిస్ట్రేషన్ ఆఫీసు దగ్గర రోజంతా పడిగాపులు పడేది.. అక్కడ ఎంతో కొంత ముట్ట చెప్పనిదే పని కాకపోయేది. పేపర్లు చేతికచ్చినంక మ్యుటేషన్‌కనీ తాసిల్దార్ ఆఫీసుకు పోతే అక్కడా నెలల తరబడి తిప్పుకునేది.. వీఆర్వోలు ఆ పేపర్ లేదు.. ఈ పేపర్ లేదు.. పేరు తప్పు పడ్డది.. అంటూ ముప్పుతిప్పలు పెట్టేది. చివరికి అన్ని పేపర్లు సరిచేసుకుని పట్టుకెళ్తే తప్పిచ్చుక తిరిగేది.. చివరికి ఎంతో కొంత ముట్టచెప్తే కానీ పనిచేయకపోయేది. పహాణీలల్ల పేర్లు మార్చి ఇబ్బందులు పెట్టేది.. పాసుబుక్కులల్ల తీరొక్క కాలాలతో పట్టాదారుడికి.. కౌలుదారులకు తాకులాటలు ఉండేటివి.. ఇట్ల ఏండ్లకాలంగా కోర్టుల చుట్టూ తిరిగేది. గిట్ల రైతులను అరిగోస పెట్టిన దరిద్రపు వ్యవస్థ ధరణి రావడంతో పీడ విరగడైంది. ఎన్నో సమస్యలకు పరిష్కారం లభించింది. భూములకు భద్రత లభించింది. ఒకరి భూమి మరొకరికి పోదన్న నమ్మకం కలిగింది. ఎక్కడి నుంచైనా తన పేరును భూమి ఉన్నదో లేదో చూసుకునే అవకాశం వచ్చింది. ఇంత మంచి ధరణిని కాంగ్రెస్ వస్తే రద్దు చేస్తామంటుండడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాత పద్ధతి వస్తే మళ్లీ గెట్టు పంచాయితీలు జరుగుతాయని, తాకులాటలు పెట్టే వాళ్లను తరిమి కొడుతామని హెచ్చరిస్తున్నారు. కాంగ్రెస్ వచ్చేది లేదు.. సచ్చేది లేదని, అట్లాంటి పార్టీని రానివ్వమని, భూములను కాపాడే బీఆర్‌ఎస్‌కే మద్దతిస్తామని స్పష్టం చేస్తున్నారు.

## ధరణిలేకుంటే మా భూములు ఆగమైతయి

మాది వేములవాడ రూరల్ మండలం నమిలిగుండుపల్లి. నా పేరు దాసరి లక్ష్మణ్. ఇప్పుడు ధరణి ఉండటం వల్ల మా భూములు ఆన్‌లైన్‌లో కనబడుతున్నయి. ధరణి లేనప్పుడు మా పాస్‌బుక్‌ల పై భూమిఉండేది, పహాణీలో చూస్తే ఉండేది కాదు. అప్పుడున్న రెవెన్యూ వ్యవస్థ రైతులను ఆగంచేసింది. పాస్‌బుక్‌లో ఉన్న భూమి మోక పై లేకుండే, ఇష్టంవచ్చినట్లు రెవెన్యూ అధికారులు మార్చేటోళ్లు. ఇప్పుడు పట్టా పాస్‌బుక్ పై ఎంత భూమి ఉందో ధరణి వెబ్‌సైట్‌లో అంతే ఉంటుంది. ధరణి వల్ల మా భూమి భద్రంగా ఉంది. ధరణి తీస్తే మా భూములు ఆగమై గొడవలు జరుగుతయి. గెట్టు పంచాయితీలు మళ్ల అయితయి. కాంగ్రెస్ పాలన ఎట్ల ఉంటదో ఇంతకుముందు మేం చూడలేదా..? వాళ్ల ఆటలు ఇక్కడ సాగవు. మీరు వచ్చేది లేదు.. సచ్చేది లేదు.

**- దాసరి లక్ష్మణ్, నమిలిగుండుపల్లి (వేములవాడ రూరల్)**



## పాతరోజులు గుర్తుకొస్తే భయమేత్తంది



కాంగ్రెసొళ్లు ధరణి రద్దు చేసి, భూమాత తీసుకొస్తామంటున్రు. ఇక కాళ్లుఅరిగేలా ఆఫీసులు, దళారీల చుట్టూ, పైరవికారుల చుట్టూ తిరుగుడే తిరగాలన్నమాట. మళ్లీ పాత రోజులు గుర్తుకొస్తే భయమేత్తంది. తెలంగాణ వచ్చాక ధరణి పోర్టల్ మంచిగున్నది. పైసా లంచం ఇవ్వకుండా జాప్యం లేకుండా ధరణితో భూముల రిజిస్ట్రేషన్, భూ యజమానుల బదలాయింపు, విరాసత్, మ్యుటేషన్ వంటివి ఎంతో సులువుగా అయితున్నయి. భూములకు భద్రత వచ్చింది. సర్వే నంబర్ల సాయంతో ఇప్పుడు మా భూములను మొబైల్లోనే చూసుకుంటున్నం. దీని రద్దు చేస్తే మళ్ల కోర్టులు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుడే.

**- పుల్లూరి రాజిరెడ్డి, మర్రిగడ్డ (చందుర్తి)**

## లంచం లేకుండా పనులు



తెలంగాణ రాకముందు పట్వారీ వ్యవస్థతో రైతుల కష్టాలు పడ్డరు. సీఎం కేసీఆర్ రైతుల గోసను చూసి పట్వారీ వ్యవస్థ రద్దు చేసి ధరణి పోర్టల్‌ను తెచ్చిండు. ఈ పథకం ద్వారా అధికారులకు లంచం ఇవ్వకుండా పనులు అయితన్నయి. పూర్తిగా డిజిటల్,ఆన్‌లైన్ విధానంలో రిజిస్ట్రేషన్లు చేస్తున్నరు. గతంలో లెక్క ఎమ్మార్వోలు, గిర్దావర్లు, ఆర్డీవోలు ఇష్టం వచ్చినట్లు రికార్డులు మార్చే అవకాశం లేదు. భూయజమానికే ధరణిలో సర్వ హక్కులను ప్రభుత్వం కల్పించింది. ఇప్పుడు కాంగ్రెస్ వచ్చి ధరణిని తీసేస్తామంటూ ప్రకటించడం విడ్డూరం. ధరణిని ప్రవేశపెట్టిన సీఎం కేసీఆర్‌కు అండగా ఉండాలె. మూడోసారి సీఎంను చేసుకోవాలె. అనవసరంగా ఆగం కావద్దు.

**- శీల రమేశ్, వెంకటాపూర్ (సిరిసిల్ల)**

## నాలుగు పైసలిత్తేనే పనిఅయ్యేది



కోళ్లమద్దిలో నాకు రెండెకరాల భూమి ఉన్నది. పంట రుణం కొరకు పహాణీల నిమిత్తం పటువారి ఆఫీసు చుట్టూ తిరిగి పరేషాను అవుడే తప్ప పని కాకపోయేది. ఎవుసం పని ఇడిచి పెట్టుకుని నాలుగు, ఐదు రోజులు తిరిగి నాలుగు పైసలు ఖర్చు పెడితే తప్ప పత్రాలు చేతికి వచ్చేది కాదు. ఇప్పుడు కేసీఆర్ సారు పెట్టిన ధరణితో మీ సేవకు పోతే రెండు నిమిషాలలో పహాణీ పత్రాలు చేతిలో పెడుతున్నారు. ఒక వేళ ధరణి తీసివేస్తే రైతులను పరేషాను చేసుడే ఐతది. బీజేపీ, కాంగ్రెస్ రైతులపై కుట్రలు చేస్తున్నయని ముందు నుంచి సీఎం కేసీఆర్ చెబుతనే ఉన్నడు. మాకిప్పుడే అర్థమైంది. కాంగ్రెస్, బీజేపీని ఇంక నమ్ముతమా..? వమీ ఆటలు ఇక్కడ సాగవు. వారు వచ్చేది లేదు.. సచ్చేది లేదు. రైతులందరూ అప్రమత్తంగా ఉండాలె.

**-కూడెల్లి లింగం, కోళ్లమద్ది (గంభీరావుపేట)**

## మళ్లీ భూసమస్యలు వత్తయి

కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తే రైతులకు మళ్లీ భూ సమస్యలు వస్తయి. ధరణి పోర్టల్‌తో అవినీతికి తావులేదు. గతంలో భూములు పట్టా చేయించుకునేందుకు వీఆర్‌వోల దగ్గరికి ఎన్ని రోజులు తిరిగినా పని కాకపోయేది. గిప్పుడు ధరణి ద్వారా స్లాట్ బుక్ చేసుకొని పది నిమిషాల్లో రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నరు. నేను రెండెకరాల భూమిని అరగంటలో రిజిస్ట్రేషన్ చేసుకున్న. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి తీసివేస్తామని చెబుతున్నరు. మళ్లీ భూ వివరాలు తారుమారు చేస్తరు. రైతులు నష్టపోతరు.

**- మంచె రాజేశం (రుద్రంగి)**



## పైరవీకారుల రాజ్యమత్తది



కాంగ్రెసొళ్లు ధరణిని బంగాళాఖాతంలో వేస్తమని అంటున్నరు. మళ్లీ పాత రెవెన్యూ విధానం అమలు చేస్తామని అంటున్నరు. వాళ్లకు ఎంత ధైర్యం. మీ తెరువు రాకుండి. మీ పాలన ఎట్ల ఉంటదో ఇంతకుముందు మేం చూడలేదా..? ఎందుకీ పిచ్చిమాటలు. అంటే రైతులు మళ్లీ దళారుల చేతిలోకి వెళ్లాల్సిందేనా? తెలంగాణ రాక ముందుకు పైరవీకారుల రాజ్యంఉండేది. భూ సమస్యలపై కాళ్లుఅరిగేలా ఆఫీసుల చుట్టూ తిరిగేవాళ్లం. దానికి తోడు పైసలిస్తేనే పని అయ్యేది. కేసీఆర్ ప్రభుత్వం ధరణి తెచ్చినంక తిప్పలు తప్పినియి. ఎవరికీ నయా పైసా ఇయ్యాల్సిన పనే లేదు. అర్ధగంటలనే భూమి పట్టాజేస్తున్రు. ధరణి మంచిగున్నది. దీనిని రద్ద చేస్తే మళ్లీ దళారులే రాజ్యమేలుతరు. మంచిగున్న పథకాన్ని తీసివేయనియ్యవద్దు.

**- ఏరెడ్డి రాజిరెడ్డి, రామన్నపేట (చందుర్తి)**

## కాంగ్రెస్‌ను ఇంక నమ్ముతమా..?



అప్పుడంత గోసవెట్టి, ఇపుడు ఏదో చేస్తమని కాంగ్రెసోళ్లు వస్తున్నరు. వాళ్లు అచ్చేది లేదు.. సచ్చేది లేదు. వచ్చినా చేసేదేమీ కూడా లేదు. అప్పుడు ఏం చేసిండ్లో మాకు తెల్వదా..? ఇప్పుడేం చేత్తరో మాకు తెల్వదా..? ధరణి తీసేస్తామంటూ అట్టిగ ఆగం పట్టించుడు తప్పితే. బీజేపీ, కాంగ్రెస్ రైతులపై కుట్రలు చేస్తున్నయని ముందు నుంచి సీఎం కేసీఆర్ చెబుతనే ఉన్నడు. మాకిప్పుడే అర్థమైంది. కాంగ్రెస్, బీజేపీని ఇంక నమ్ముతమా..? తప్పిదారి ఓటేత్తే ఇక ఎవుసం పోయినట్టే. రైతుల కథ మళ్లీ మొదటికి అచ్చినట్టే. అందుకే రైతులందరూ అప్రమత్తంగా ఉండాలె. సాగును బంగారం చేసిన కేసీఆర్‌కు అండగా ఉండాలె. మూడోసారి సీఎంను చేసుకోవాలె. అనవసరంగా ఆగం కావద్దు.

**- మారాజు గణేశ్, నమిలిగుండుపల్లి (వేములవాడ రూరల్)**